వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

● ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కృష్ణ

ఎదులాపురం, ఆగస్టు 24 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. డెంగ్యూ నివారణ చర్యలో భాగంగా శనివారం ఆదిలాబాద్‌లోని కేఆర్కే కాలనీలో డ్రై డే నిర్వహించారు. డెంగ్యూ పాజిటివ్ వచ్చిన కేసు ఇంటి పరిసర ప్రాంతంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వారంలో రెండు రోజులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతంలోనే డెంగ్యూ దోమల లార్వా ఉంటుందన్నారు. ఆయన వెంట అంకోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సర్ఫరాజ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఎదులాపురం: డెంగ్యూ పాజిటివ్ వచ్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ

జైనథ్ : ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దోమల నివారణకు చర్యలు

నార్నూర్, ఆగస్టు 24: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీవో స్వప్నశీల అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో మురుగు గుంటలను పరిశీలించారు. వాటిలో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో ప్రజలు వ్యాధుల బారిన పడుకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ఫీవర్ సర్వే

జైనథ్, ఆగస్టు 24 : మండల కేంద్రంలో శనివారం ఇంటింటికీ ఫీవర్ సర్వే చేపట్టినట్లు వైద్యురాలు నయనత పేర్కొన్నారు. శనివారం నమస్తే తెలంగాణలో 'లోపించిన పారిశుధ్యం' కథనానికి వైద్య సిబ్బంది స్పందించి ఇంటింటికీ తిరుగుతూ జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరిస్తూ వారి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నిరాల గ్రామంలో సైతం ఫీవర్ సర్వే చేపడుతున్నారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా మురుగు కాల్వల్లో, గుంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

దిలావర్‌పూర్, ఆగస్టు 24: ప్రతి విద్యార్థి రోజు కళాశాలకు హాజరయ్యే విధంగా చూడాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరశురాం అధ్యాపకులకు సూచించారు. శనివారం దిలావర్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. మూల్యాంకనం సక్రమంగా జరుగుతుందా అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందంతో సమావేశం నిర్వహించి రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన కమ్యూనిస్టుల లక్ష్యం

ఎదులాపురం, ఆగస్టు 24 : కులం, మతం ఆధారంగా దేశంలో రాజకీయాలు నడవడం వాళ్ల సమాజం ముందుకుపోదని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల నిర్మూలన కోసం అంబేద్కర్ చేసిన కృషిని వివరించారు. ఈ శిక్షణ తరగతులకు పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు మంజుల అధ్యక్షత వహించగా సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆశన్న, సురేందర్, నాయకులు అగ్గిమల్ల స్వామి, చిన్నన్న, పొచ్చన్న, జమున, శకుంతల, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రతిమా రెడ్డికి బెస్ట్ డీఎం అవార్డు అందజేత

అవార్డు అందుకుంటున్న డీఎం ప్రతిమా రెడ్డి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 24 : హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవంలో నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి రాష్ట్ర మొదటి ఉత్తమ డిపో మేనేజర్‌గా అవార్డును సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆర్టీసీ ఆదాయాన్ని ఏకంగా రూ.28 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచి డిపోను లాభాల బాట పట్టించారు. ఉత్తమ అవార్డును అందుకున్న డీఎంను ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

సారంగాపూర్, ఆగస్టు 24: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అవరోధిస్తారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంధ్యారాణి అన్నారు. శనివారం జామ్ బాలికల గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థుల ఫ్రెషర్ డే నిర్వహించారు. విద్యార్థినులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీనియర్ వైస్‌ప్రిన్సిపాల్ నిహారిక, జూనియర్ ప్రిన్సిపాల్ స్వరూప, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అధికారుల శ్రమదానం

కుంటాల, ఆగస్టు 24 : కుంటాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కల్లూరు కేజీబీవీ ఆవరణలో స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు శ్రమదానం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, కార్యదర్శులు భోజన్న, రాజబాపు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 24 : వర్షాకాలం దృష్ట్యా నిర్మల్‌లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పలు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. శనివారం నిర్మల్‌లోని భాగ్యనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. మురుగు నీటి నాళాలలో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బందిచే శుభ్రం చేయించారు.

వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

బోథ్, ఆగస్టు 24 : గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని బోథ్ ఎంపీడీవో జీవన్ రెడ్డి సూచించారు. శనివారం గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. 33 గ్రామపంచాయతీ పరిధిలో 270 వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని సూచించారు. సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెగ్యులర్ వార్డెన్లను నియమించాలి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్, ఆగస్టు 24 : ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమాలలో, జూనియర్, డిగ్రీ కళాశాలకు ఇన్‌చార్జులను తొలగించి రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. శనివారం ఉట్నూర్‌లో ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి వసంత్‌రావ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌చార్జి పాలనలో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. రెగ్యులర్ మెనూ అందడం లేదన్నారు. అలాగే మరికొందరైతే ఏకంగా రెండింటికి వార్డెన్లుగా ఉంటూ విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నారన్నారు. కావున రెగ్యులర్‌లనే నియమించాలని కోరారు. ఇక్కడ బీఆర్ఎస్ యువ నాయకులు ముజీబ్, మహేందర్, బాబాశ్యాం, భూమన్న, రవి, బాలాజీ, అన్వేశ్, హైమద్, తాజ్ ఉన్నారు.

వీధి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు

వీధి కుక్కల స్టెరైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, ఆగస్టు 24 : ఆదిలాబాద్‌లో వీధి కుక్కల బెడదను నివారించేందుకు బల్దియా తరపున చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు శనివారం బంగారిగూడలోని డంప్ యార్డు వద్ద గల జంతువుల సంరక్షణ కేంద్రంలో కొనసాగుతున్న వీధి కుక్కల స్టెరైజేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. కుక్కల బెడద నివారణ చర్యలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో పాటు సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో దాదాపు 1200 దాకా వీధి కుక్కలు ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. పట్టణంలో వీధి కుక్కల వల్ల ఇబ్బందులు ఉంటే నేరుగా తనకు లేదా మున్సిపల్ కమిషనర్ తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ శ్రీనివాస్, అశోక్ రెడ్డి, దశరథ్ పటేల్, మహేందర్ తదితరులు ఉన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం

ఇచ్చోడ, ఆగస్టు 24 : మండల కేంద్రంలోని ఓల్డ్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో కమిషనర్ ఆదేశాల మేరకు ఆయుష్ డాక్టర్ శ్రీకాంత్ వృద్ధులకు వైద్య శిబిరం, జిరాట్రిక్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఆయుష్ డాక్టర్ ప్రీతల్ హాజరయ్యారు. మొదటగా ధన్వంతరి చిత్రపటానికి పూజలు చేశారు. 150 మంది వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేసి, ఆయుర్వేద మందులు, తైలాలు, చూర్ణాలు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి రానివారు పీహెచ్‌సీ ఆవరణలోని ఆయుష్ డిస్పెన్సరీకి వచ్చి పరీక్షలు చేసుకొని మందులు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ సత్యలక్ష్మి, ఎస్‌సీఎస్ లక్ష్మి, ఎస్ఎన్‌వోలు పద్మావతి, ఎండీ అహ్మద్, వెస్ట్ సబ్ సెంటర్ ఏఎన్ఎంలు , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

బోథ్, ఆగస్టు 24 : వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఏపీవో జగ్దేరావ్ సూచించారు. శనివారం మండలంలోని బోథ్–జీడిపల్లె మార్గంలో అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు పరిశీలించారు. మొక్కల చుట్టూ నీరు నిల్వ ఉండేలా గుంతలు తవ్వి, కంచెలు ఏర్పాటు చేయాలని కూలీలకు సూచించారు. ఏపీవో వెంట టీఏ చంద్రశేఖర్, ఎఫ్ఏలు, కూలీలు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు గాయాలు

బోథ్, ఆగస్టు 24 : ఎలుగుబంటి దాడిలో పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన తొడసం ఆనంద్‌రావ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కోతుల బెడద ఉండడంతో శనివారం పత్తి చేను కాపలాకు వెళ్లాడు. చేనులో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా ఆనందరావుపై దాడి చేసింది. అతని కాలికి తీవ్రగాయమవడంతో స్థానికులు బోథ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం డాక్టర్ సూచన మేరకు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

అభివృద్ధి పనుల కోసం ఇంటింటా సర్వే

ఇంద్రవెల్లి, ఆగస్టు 24 : ఏమాయికుంటను ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాడానికి చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. శనివారం ఏమాయికుంట గ్రామంలో ఈజీఎస్, పంచాయతీ అధికారులు పర్యటించి ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి మరుగుదొడ్లతో పాటు ఇంకుడు గుంతలు ఉన్నాయా లేదా అనేది సర్వే చేయడం జరుగుతుందన్నారు. లేని వారికి మంజూరు చేసి నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్, ఎంపీవో సమీర్‌హైమద్, ఈజీఎస్ టీఏలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

భైంసాటౌన్, ఆగస్టు 24 : భైంసాలోని ఏపీ నగర్‌కు చెందిన బండారి మారుతి(45) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి నిర్మాణ కూలీగా పని చేసే మారుతి గీతా పెట్రోల్ బంక్ పక్కన నూతనంగా చేపడుతున్న ఓ ఇంటి నిర్మాణంలో లేబర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పని నిమిత్తం అక్కడికి వెళ్లాడు. అక్కడ విద్యుత్ సర్వీస్ వైర్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. శనివారం తండ్రి ఇంటికి రాక పోవడంతో పెద్ద కొడుకు ఉదయం వెళ్లి చూడగా తండ్రి మృతి చెంది పడి ఉన్నాడు. కాగా ఇంటి నిర్మాణానికి అక్రమ విద్యుత్ వాడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంటి యజమాని దత్తురాంపటేల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు మృతి

గజానన్ దేశ్‌ముఖ్ (ఫైల్)

భీంపూర్, ఆగస్టు 24 : భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామానికి చెందిన గజానన్ దేశ్‌ముఖ్ (32) మహారాష్ట్ర నాందేడ్ దవాఖానలో చికిత్సపొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. గజానన్ రెండు రోజుల క్రితం మరో రైతుతో కలిసి చేనులో పనులకు వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా బురద రోడ్డుపై అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో గజానన్ తలకు తీవ్రంగా గాయాలవడంతో మహారాష్ట్రలోని దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మరో రైతు చిన్నయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం కరంజిలో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం

భైంసాటౌన్, ఆగస్టు 24 : భైంసాలోని గీతానగర్ కాలనీకి చెందిన అరవింద్ ఇంట్లో విద్యుదాఘాతంతో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంట్లోని టీవీ, కూలర్ కాలిపోయింది.

భీంరావ్ వర్ధంతికి పీవోకు ఆహ్వానం

ఉట్నూర్, ఆగస్టు 24 : ఉట్నూర్‌లో నిర్వహించే మొదటి గిరిజన మంత్రి కోట్నాక్ భీంరావ్ వర్ధంతికి రావాలని నిర్వహణ కమిటీ సభ్యులు శనివారం క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి ఆహ్వానపత్రం అందించారు. ఇక్కడ రాజ్‌గోండ్ సేవా సమితి నాయకులు విషంరావ్, జిల్లా అధ్యక్షుడు కొద్దు, నాయకులు నిరంజన్, ప్రకాశ్, బాలాజీ, భీమన్న, ముకుంద్‌రావ్, గిరిజన నాయకులు ఉన్నారు.

పీవోకు సన్మానం

ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శనివారం క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ తమ కళాశాలలో 1800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అత్యధికంగా గిరిజన విద్యార్థులు ఉన్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కళాశాల ప్రత్యేకతలు, విద్యార్థులకు ఇస్తున్న ఉచిత శిక్షణ విషయాలను వివరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, అధ్యాపకులు నర్సింగ్‌రావు, రాణి, రవిందర్, శ్రీనివాస్, జావిద్, పీడీ అనిత, సీనియర్ అసిస్టెంట్ పెంటన్న పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలి

భైంసాటౌన్, ఆగస్టు 24 : మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ కార్యదర్శి దిగంబర్ అన్నారు. శనివారం బడ్‌గావ్ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన నిర్వాహణను ప్రైవేట్ ఏజెన్సీకి ఇవ్వడం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.26వేల కనీస వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సేవావాహిక విరాళం

భీంపూర్, ఆగస్టు 24: భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామానికి చెందిన జైస్వాల్ సురేశ్ శనివారం రూ.18 వేల విలువైన సేవావాహికను గ్రామానికి విరాళంగా అందజేశారు. పార్థివ దేహాలను వైకుంఠధామాలకు చేరవేసేందుకు ఈ వాహికలు సౌకర్యంగా ఉంటాయని, పేద కుటుంబాలకు ఇబ్బందులుండవని సురేశ్ తెలిపారు. ఈ సందర్భంగా సురేశ్‌ను గ్రామస్తులు, నాయకులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

ముథోల్, ఆగస్టు 24 : ముథోల్‌లో నెలకొన్న సమస్యలు త్వరగా పరిష్కరించాలని గ్రామ ప్రజలు ఎంపీడీవో శివ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముథోల్‌లో పలు కాలనీలలో రోడ్లు గుంతలమయంగా మారాయని వాటిని పూడ్చడంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయాలని కోరారు. రానున్న పొలాల అమావాస్య, వినాయక చవితి పండుగలను దృష్టిలో పెట్టుకొని పనులు పూర్తి చేయాలని కోరారు. అనంతరం డీఆర్డీవో విజయలక్ష్మిని శాలువాతో సన్మానించి సమస్యపై విన్నవించారు. వినతి పత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్, యువకులు ఉన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ఆనందుల రవితేజ(ఫైల్)

బోథ్, ఆగస్టు 24 : అప్పుల బాధతో మండలకేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన ఆనందుల రవితేజ(24) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..రవితేజ ఇటీవల మెడికల్ షాపు పెట్టుకున్నాడు. దీంతోపాటు ఐదెకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఇందుకు రూ.5 లక్షలు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనతో శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు మొదట బోథ్‌లోని పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు నిర్మల్ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గృహజ్యోతిని సద్వినియోగం చేసుకోండి

నేరడిగొండ, ఆగస్టు 24 : ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతిని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ డీపీఈవై విజయ సారథి సూచించారు. శనివారం మండలంలోని లఖంపూర్‌లో గృహజ్యోతి పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గృహజ్యోతిలో సబ్సిడీ రానివారు ఎంపీడీవో కార్యాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ మీటరు వినియోగించుకోవాలని, లేనివారు కొత్తగా మీటరుకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చిన మీటర్ నంబర్‌కి ప్రజాపాలన దరఖాస్తు చేస్తే జీరో కరెంటు బిల్లు వస్తుందని తెలిపారు. సందేహాలుంటే సమీప విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారి యోగేశ్, లైన్‌మన్ రమేశ్, విద్యుత్ విజిలెన్స్ కానిస్టేబుల్ నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I, RAJANI NAJMA BANU (Old Name) W/o. SALEEM KABEERUDDIN RAJANI R/o H.No. 4-3-18/45/2,Opp : B Ramulu Complex, Gunj Road, Adilabad. Is Here By Declare That Change My Name As "RAJANI NAJAMA BANU" (New Name) Holding Pass port No M6117801, Dt: 10-2-2015 to 09-02-2025 Issued At Hyderabad,Hence Declared.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

భైంసాటౌన్: శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో అల్ఫోర్స్ విద్యార్థులు

కుంటాల: వాసవి విద్యాసంస్థల్లో..

ముథోల్: రభీంద్ర పాఠశాలలో..

ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు చోట్ల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. - నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 24

ఖానాపూర్: ఉట్టి కొడుతున్న విద్యార్థులు

ఇచ్చోడ: ప్రగతి పాఠశాలలో..

విజయవంతం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 24 : లోక కల్యాణార్థం ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తున్న మహాపాదయాత్రను భక్తులు విజయవంతం చేయాలని సాయిదీక్షా సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిర్మల్‌లోని ఆలయంలో శనివారం మహాపాదయాత్ర ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండి రైతులు అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలనే ఉద్దేశంతో నటరాజ్ నగర్ శివాలయం నుంచి ఎనిమిదో సారి దిలావర్‌పూర్ మండలం కదిలి పాప హరిశ్వర ఆలయం వరకు మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాదయాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హరిహర క్షేత్రం ఆలయ గురుస్వామి నవయుగమూర్తి, సాయిదీక్ష సేవా సమితి సభ్యుడు లక్కడి జైపాల్‌రెడ్డి, నందు, జిందం గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, ఆగస్టు 24 : ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటుతో పాటు ఐటీడీఏలో 12 సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీ, ప్రత్యేక ట్రైబల్ అడ్వాయిజర్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్న ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండలాధ్యక్షుడు పర్కా చిత్రు పిలుపునిచ్చారు. శనివారం హీరాపూర్ గ్రామ సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 3ను యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ తొమ్మిది తెగల సమన్వయకర్త కోట్నాక్ బారిక్‌రావ్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భరత్, డివిజన్ ఉపాధ్యక్షుడు పుర్కా హనుమంత్‌రావ్, విద్యార్థి సంఘం మండల ప్రధానకార్యదర్శి పృథ్వీరాజ్, తుడుందెబ్బ మండల ఉపాధ్యక్షుడు సోయం వినోద్, కోశాధికారి మెస్రం జైరాం, కార్యదర్శి సోయం మురారి, కమిటీ సభ్యులు కుమ్రం భీంరావ్, మర్సుకోల ముకుంద్ పాల్గొన్నారు.

అన్నాభావు సాఠేను ఆదర్శంగా తీసుకోవాలి

తానూ